క్లుప్తంగా

జీరో సర్వీస్ ఉన్నా బదిలీ చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: త్వరలో జరగబోయే ఉపాధ్యాయ బదిలీల్లో 317 జీవో ప్రకారంగా జిల్లాలకు కేటాయించిన ఉపాధ్యాయులకు జీరో సర్వీస్ ఉన్నా.. బదిలీలకు అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చవాన్, వలభోజు గోపిక్రిష్ణ కోరారు. బ్లాక్ చేయబడిన 13 జిల్లాలను ఓపెన్ చేసి స్పౌజ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. బదిలీల కంటే ముందే స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేయాలన్నారు.

నియామకాన్ని వ్యతిరేకిస్తున్నాం

బోథ్: బీఆర్ఎస్ మండల కన్వీనర్‌గా నారాయణ రెడ్డిని నియమించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు బీఆర్ఎస్ రైతు విభాగం అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్‌లు అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ.. గత 17 సంవత్సరాలుగా పార్టీ కోసం పని చేశామని, నారాయణ రెడ్డి ఏనాడు పని చేయలేదని ఆరోపించారు. లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని చెప్పి, డబ్బులు తీసుకుని ఇళ్లు కట్టిఇవ్వలేదని విమర్శించారు. ఆయనను తొలగించి, కష్టపడి పని చేసే వారికి కన్వీనర్ పదవి ఇవ్వాలన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కైలాస్‌నగర్: మున్సిపల్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిణి స్టేడియంపై ప్రత్యేక దృష్టి సారించారు. దాన్ని ఆనుకుని ఉన్న ఆక్రమణాలను తొలగించడంతో పాటు స్టేడియం పరిసరాలు, రోడ్డుపై పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. శనివారం ఆమె ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది పలు ఆక్రమణలను తొలగించారు. కొంతమంది స్వచ్ఛందగా తమ దుకాణాలను తీసివేయగా, మరికొన్నింటిని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. దుకాణదారులు మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఆక్రమణల తొలగింపు ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ శైలజ పర్యవేక్షించారు.

విజయవంతం చేయండి

తలమడుగు: ఈనెల 25న దేశవాప్తంగా నిర్వహించే జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ కోరారు. శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాయలంలో పోలింగ్ బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో యువతీ, యువకులు, పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించాలన్నారు. ఓటరు దినోత్సవంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, అజీమ్, విజయ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తాంసి: భీంపూర్ మండలంలోని గుబిడి గ్రామస్తులు శనివారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కరంజి(టి) నుంచి గుబిడి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్ల నిధులు విడుదల చేసింది. దీంతో శనివారం గ్రామస్తులు సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతాప్, గ్రామస్తులు నవీన్, రవీందర్ రెడ్డి, ఇస్తారి, సోమన్న, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

ఉట్నూర్‌రూరల్: పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని డీసీపీవో అసిస్టెంట్ అశ్విని హెచ్చరించారు. శనివారం డీసీపీవో, ఆపరేషన్ స్మైల్ టీం సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని ఇటుక తయారీ కేంద్రాలు, హోటళ్లు, తదితర కార్మిక స్థలాల వద్ద చిన్నారులను గుర్తించారు. చిన్న పిల్లలను పనిలో పెట్టుకోకూడదని అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బడులకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో మండల సహాయ కార్మిక అధికారి గోవర్ధన్, ఎస్సై దేవురావు, సిబ్బంది గంగన్న, ఎన్జీవో సిబ్బంది, సుభాశ్ పాల్గొన్నారు.

ఖమ్మం తరలిన రైతులు

బేల: మండల కేంద్రం నుంచి ఆయా గ్రామాల రైతులు ఆయిల్‌పాం సాగును పరిశీలించేందుకు ఖమ్మం జిల్లాకు తరలివెళ్లారు. ఈసందర్భంగా జిల్లా రైతుసమన్వయ సమితి సభ్యుడు ఠాక్రే మంగేష్ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా అశ్వారావుపేట దుమంగూడ ఉద్యానవన శాఖ సహకారంతో ఆయిల్‌పాంతో ప్రయోజనాలు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఠాక్రే గంభీర్, సతీష్‌పవార్, రైతులు పాల్గొన్నారు.

విస్తరాకులకు డిమాండ్..



విస్తరాకులను తయారు చేస్తున్న దంపతులు



విస్తరాకులు

ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాస్‌ల వినియోగం పెరిగినప్పటికీ, మోదుగ ఆకులతో తయారుచేసే విస్తరాలకు మాత్రం డిమాండ్ తగ్గలేదు. ఇప్పటికీ చాలా మంది విస్తరాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పండగలు, ఇండ్లలో నిర్వహించే శుభకార్యాలయాలకు మోదుగ ఆకులతో తయారు చేసిన విస్తరాకులనే కొనుగోలు చేస్తున్నారు. తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన పొచ్చుబాయి అనే మహిళతో పాటు, ఆదిలాబాద్ పట్టణం భాగ్యనగర్ కాలనీకి చెందిన పొచ్చన, పోసాని దంపతులు విస్తరాకుల విక్రయాలతో జీవనోపాధి పొందుతున్నారు. మావల, అంకోలి, దేవాపూర్ అటవీ ప్రాంతాలకు వెళ్లి మోదుగ ఆకులు సేకరిస్తున్నారు. స్థానిక అశోక్‌రోడ్‌లో వాటిని విక్రయిస్తున్నారు. – కైలాస్‌నగర్



విస్తరాకులు కుడుతున్న పొచ్చుబాయి

ఆలయాల్లో భక్తజన సందడి

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ అతి పురాతన మల్లికార్జున ఆలయంలో శనివారం అమావాస్య సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాతో పాటు పరిసర ప్రాంతమై మహారాష్ట్రకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. ఆలయానికి ఆనుకొని ఉన్న చెరువులో పుణ్య స్నానాలు ఆచరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

శనిదేవుడికి ప్రత్యేక పూజలు

తాంసి: మండల కేంద్రంలోని రామలింగేశ్వర ఆలయంలో గ్రామస్తులు శనీశ్వర దేవుడికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శనివారం అమావాస్య వచ్చిన రోజున శని దేవుడికి పూజలు చేస్తే సుఖసంతోషాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఉదయం నుంచే రామలింగేశ్వర ఆలయంలోని నవగ్రహాలతో పూజలు చేశారు. ఆలయ అర్చకుడు జూకంటి సతీష్, గ్రామపెద్దలు కృష్ణ, చిన్న రాంరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



ఇచ్చోడ: మల్లికార్జున ఆలయం వద్ద..



తాంసి: క్యూలైన్‌లో భక్తులు



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



బైరవ్‌దేవ్ ఆలయ ఆవరణలో పూజలు చేస్తున్న భక్తులు

ముగిసిన జంగీ జాతర

బేల: మండలంలోని సదల్‌పూర్ అటవీ ప్రాంతంలోని భైరందేవ్, మహాదేవ్ ఆలయాల వద్ద నిర్వహించిన జంగీ జాతర శనివారం ముగిసింది. కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా కాలదహీ హండీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాదేవ్ ఆలయంలో జూనోని గ్రామభజన మండలి సభ్యులు భజన, కీర్తనలతో శోభాయాత్ర చేపట్టారు. అనంతరం మహాదేవ్ ఆలయం పైభాగంలో ప్రత్యేక పూజలు చేసి, ఆలయ శిఖరంపై జెండా పెట్టారు. కాలదహీ హండీకి పూజలు చేసి పగులగొట్టారు. ఆలయం పైనుంచి కిందకు భక్తులకు ప్రసాదం విసిరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి సిడాం కుషాల్‌రావు, కార్యదర్శి పెందుర్ రాందాస్, భీంరావు, పూజారులు గంగాధర్, వెంకట్రావు, వినోద్ పాల్గొన్నారు.

ఓం శనీశ్వరాయ నమః



దర్శనానికి బారులు తీరిన భక్తులు

జిల్లా కేంద్రంలోని శనీశ్వర ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శని అమావాస్య పురస్కరించుకొని వేకువజామున 4 గంటల నుంచే బారులు తీరారు. ఆలయంలో నువ్వుల నూనెతో శనీశ్వరున్ని అభిషేకించి, నల్ల వస్త్రాన్ని సమర్పించి సుఖ సంతోషాలు చేకూరాలని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేయగా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. – ఆదిలాబాద్

సన్మానం

బోథ్: బీఆర్ఎస్ మండల కన్వీనర్‌గా ఎన్నికైన నారాయణ రెడ్డిని బోథ్ బీఆర్ఎస్ నాయకులు శనివారం సన్మానించారు. కన్వీనర్‌గా తనను నియమించిన ఎమ్మెల్యే బాపూరావ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్, జిల్లా కో ఆప్షన్ సభ్యులు తాహెర్ బిన్ సలాం, సత్యనారాయణ, రాజ్‌కుమార్, ఖలీమ్, శేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించాలి

నేరడిగొండ: సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని మండల విద్యుత్ శాఖ ఏఈ ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని దేవుల్‌నాయక్ తండాలోని బకాయిదారులతో సమావేశమయ్యారు. ప్రతి నెలా గడువులోగా వినియోగదారులు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి

ఇచ్చోడ: రానున్న ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. శనివారం మండలంలోని బోరిగామ, కామగిరి, గాంధీనగర్, జున్నీ, దేవులనాయక్‌తండా, అడేగాం (కె) గ్రామాల్లో పర్యటించిన ఆయన పోలింగ్ బూత్ కమిటీలను ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పోలింగ్ బూత్ కమిటీల్లో సభ్యత్వం తీసుకోవడానికి యువత స్వచ్ఛంద ముందుకు వస్తున్నారని తెలిపారు. పార్టీని బలోపేతం చేయడానికి యువతతో కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న సాకటి దశరథ్

కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్‌రావ్ ఆమ్టే, కదం బాబారావ్, మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ, పెరుమల్ల పోశెట్టి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

నార్నూర్: గాదిగూడ మండలంలోని రోమస్‌కాసా గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని శనివారం గ్రామస్తులు, పేర్సాపేన్ సంక్షేమ సంఘం నాయకులు కుమురం భీం జిల్లా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని పేర్సాపేన్ ఆలయ ఆవరణంలో భక్తుల సౌకర్యార్థం షెడ్డు మంజూరు చేయాలన్నారు. అలా గే సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పటేల్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలి

బజార్‌హత్నూర్: ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, విద్యాహక్కు చట్టం, లైంగిక వేధింపులు, మోటారు వెహికిల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టాలు, కోర్టు పరిధిలో జరిగే విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సయ్యద్ ముజాహిద్, ప్రిన్సిపాల్ రాజశేఖర్, బార్ అసోసియేషన్ సెక్రటరీ పంద్రం శంకర్, న్యాయవాదులు, రూపేందర్‌సింగ్ ఠాకూర్, ఆడెపు హరీష్, కుమ్మరి విజయ్, పీసీ భూమేష్, విజయ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

బోథ్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బోథ్ సీఐ కిరణ్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చైల్డ్ లేబర్, సైబర్ నేరాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్సై కేంద్రే రవీందర్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోథ్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్

క్రీడలతో స్నేహ సంబంధాలు



బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

గుడిహత్నూర్: క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీతా జాదవ్, బీఆర్ఎస్ కన్వీనర్ కరాడ్ బ్రహ్మనంద్, బూర్ల లక్ష్మీ నారాయణ, టోర్నీ నిర్వాహకులు కాడే పిరాజీ, సోలంకె భీవాజీ, ప్రశాంత్ పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

తాంసి: మండలంలోని లీమ్‌గూడలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. జైహనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో శనివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించి గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో బోథ్ మండలంలోని ఘన్‌పూర్, బెల్సరీరాంపూర్ జట్లు తలపడ్డాయి. ఘన్‌పూర్ జట్టు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. గెలుపొందిన జట్టుకు భీంపూర్ ఎంపీపీ సంతోష్ రూ.21వేల నగదు అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన రాంపూర్ జట్టుకు తుడుందెబ్బ మండల అధ్యక్షుడు ఆత్రం భారత్ రూ.15వేల అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు యశ్వంత్, గజానన్, సంభు, యువజన సంఘం సభ్యులు దత్తు, స్వామి క్రీడాకారులు పాల్గొన్నారు.

‘బెంగాల్ ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవాలి’

ఆదిలాబాద్‌టౌన్: బేల మండలంలో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న బెంగాల్ ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. సీజన్ కాలంలో మాత్రమే బెంగాల్ నుంచి బేల మండలంలోని పలు అమాయక ఆదివాసీ గిరిజన గ్రామాలకు వస్తున్నారన్నారు. ప్రత్యేక గదులను ఏర్పాటు చేసుకొని కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు, కాళ్ల నొప్పులకు ఇంజక్షన్లు ఇస్తున్నారని ఆరోపించారు. బేల మండలంలోని చెప్రాల, సోన్ కాస్, మశాల(బి)గూడ, దహిగావ్ గ్రామాల్లోని అమాయక ప్రజలకు అధిక డోసులు ఇంజెక్షన్లు ఇస్తున్నారని అన్నారు. అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో భీంసరి ఉప సర్పంచ్ మల్లయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు రాకేష్, ఫహీం పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అటెన్షన్ ప్లీజ్ — నిరుపయోగంగా దోబీఘాట్



తలమడుగు: మండల కేంద్రంలోని లక్షలు వెచ్చించి నిర్మించిన దోబీఘాట్ నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో రజకులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని రజకులు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: దిలీప్, ఎంపీవో, ఫోన్: 90008 73509

చెట్టెక్కిన మంచె..



తాంసి: పంటలను అడవి జంతువుల నుంచి కాపాడుకునేందుకు రైతులు వినూత్న పద్ధతులు పాటిస్తున్నారు. కొందరు రైతులు చెట్లపై మంచెలు ఏర్పాటు చేసుకొని కాపలా ఉంటున్నారు. భీంపూర్ మండలంలోని రాజ్‌ఘడ్ గ్రామానికి చెందిన రైతు ఏర్పాటు చేసిన మంచె ఆకట్టుకుంటుంది.

ఆశ్రమ పాఠశాల తనిఖీ



మాట్లాడుతున్న జడ్జి దుర్గా రాణి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్సెటిపేట ఆశ్రమ పాఠశాలను మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి దుర్గారాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వసతి గదులు, పరిసరాలు, వంట గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులను పరిశీలించారు. అదే విధంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. గృహహింస, మోటర్ వెహికిల్ యాక్ట్, నిర్వాహణ, న్యాయసేవా సంస్థ సేవలు, పలు చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు అశోక్, రాజు, కళాశాల ప్రిన్సిపాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899